క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే నంబూరు మండల పర్యటన

అచ్చంపేట: స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం అచ్చంపేట మండలంలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 10 గంటలకు మండలంలోని చామర్రులో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. 11 గంటలకు మాదిపాడు అటవిలో స్వయంభూ సత్తెమ్మతల్లి దేవాలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద కోటి దీపోత్సవానికి హాజరవుతారు.

డిసెంబర్ 3న కార్తీక సమారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల గో సంరక్షణ శాలలో డిసెంబర్ 3న కార్తీక సమారాధన జరుగుతుందని ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన్‌రావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు సత్యనారాయణ వ్రతం జరుగుతుందన్నారు. కార్తీక సమారాధనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అన్నా సుమన్, కార్యదర్శి తొమండ్రు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొత్తూరు విశ్వేశ్వరరావు, కోశాధికారి కనమర్లపూడి సుబ్బారావు ఉన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పంచారామ క్షేత్రాల దర్శనం కోసం డిసెంబర్ 3న రాత్రి 7 గంటలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ బుధవారం తెలిపారు. రాను పోను చార్జీ కేవలం రూ.940 నిర్ణయించడం జరిగిందన్నారు. సత్తెనపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7352897359, 7382895691 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

క్రోసూరు: సైబర్‌నేరాలు, ఇంటర్నెట్ వినియోగాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అమరావతి గుడ్‌షెపర్డ్స్ స్వచ్ఛంద సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి అన్నారు. బుధవారం క్రోసూరు, ఊటుకూరు జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు సైబర్ నేరాలు, ఇంటర్నెట్ వినియోగానికి సురక్షిత సాధనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విన్నరసి మాట్లాడుతూ పెద్దల అనుమతి లేకుండా విద్యార్థులు మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ ఆటలతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించి మంచి మార్గంలో నడిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కోలా సమీర్ మాట్లాడుతూ కంప్యూటర్ ద్వారా నిర్వహించే ఆర్థిక లావాదేవీలలో జరిగే మోసాలు, ఫోను ద్వారా జరిగే మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు 100, చైల్డ్‌లైన్ 1098లకు ఫోనులు చేసి జరిగిన మోసాలను తెలియచేయవచ్చన్నారు. చిల్కా బాబూరావు అధ్యక్షత వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై అవగాహన

మాదల(ముప్పాళ్ళ): రైతులు జీవన ఎరువుల వాడకాన్ని చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా జీవన ఎరువుల తయారీ, ప్రాముఖ్యతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్రవరూప జీవన ఎరువుల లభ్యత వాడకంలో సులభతను రైతులకు వివరించారు. జీవన ఎరువులు ఎలా తయారు చేసుకోవాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ఏఈఓ పావని, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న విద్యుత్ తీగల ప్రమాదం



సత్తెనపల్లి: పట్టణంలో విద్యుత్ తీగలు వేళ్లాడుతూ ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో ఉన్న దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం వద్ద మూల మలుపులో విద్యుత్ తీగలు రోడ్డుపైకి వేళ్లాడుతున్నాయి. వాహనాల రాకపోకదారులు కర్రలతో విద్యుత్ తీగలను తప్పించి ముందుకు సాగుతున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదం జరగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధితో ప్రజలకు చేరువైన సీఎం జగన్



చేజర్లలో సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ రాఘవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



కందులవారిపాలెంలో అభివృద్ధి, సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, తదితరులు



క్రోసూరులో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన జెడ్పీటీసీ జమీల, ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

నకరికల్లు: సంక్షేమ, అభివృద్ధితో పారదర్శకంగా పరిపాలిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజలకు చేరువయ్యారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేజర్లలో డీబీటీ ద్వారా 5,889 మందికి రూ.17,82,33,917, నాన్ డీబీటీ ద్వారా 2,441 మందికి రూ.5,84,55,525 ప్రజలకు అందించారన్నారు. వీటితో పాటు గ్రామంలో రక్షిత మంచినీరు, ఊరచెరువు ఆధునీకరణ లాంటి పనులు శాశ్వత ప్రయోజనాలను గ్రామ ప్రజలకు చేకూరుస్తాయని అన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, బొడ్లపాటి భాస్కరరెడ్డి, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టాలంటే జగనే కావాలి

సత్తెనపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి అన్నారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల కోసం అహర్నిశలు పోరాడే జగనన్నకు అందరూ కలిసి మద్దతుగా నిలబడదామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జగన్‌తోనే నిరుపేదలకు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ముందుగా కందులవారిపాలెంలో నాలుగున్నర ఏళ్లలో రూ.17,27,06,718తో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం అక్కడే బస చేసేందుకు ఉపక్రమించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఈపూరి బ్రహ్మారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, జేసీఎస్ ఇన్‌చార్జ్ బొంతు వెంకటరెడ్డి, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలు బూతుకూరి లక్ష్మీ, సర్పంచ్ బూతుకూరి చిన్న వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు శ్యాంసన్, యల్లమంద, శివయ్య, చిన్న లక్ష్మారెడ్డి, బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, చిన్న, సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, తదితరులున్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కొరుకునే పార్టీ వైఎస్సార్‌సీపీ

క్రోసూరు: బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోరుకునే పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ అని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వెలది అప్పారావు అన్నారు. బుధవారం క్రోసూరు సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ అధ్యక్షతన ముఖ్యఅతిథులుగా ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమీలాగఫూర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందించటం జరిగిందని అందరికీ తెలుసన్నారు. అర్హత ఉంటే చాలు ఒకే కుటుంబంలో మూడు, నాలుగు పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఉన్నారని అన్నారు. ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ పేదల ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డి, నంబూరు శంకరరావులకు వచ్చే 2024 ఎన్నికల్లో తిరిగి అవకాశం ఇచ్చేందుకు పట్టుదలగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసారు. పల్లెనిద్ర చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, సయ్యద్ అబ్దుల్ రహీం, అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, నారు శ్రీనివాసరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, చిలకా చిన్నప్ప పాల్గొన్నారు.

మాదలలో వై ఏపీ నీడ్స్ జగన్..

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల-2 గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మక్కెన అచ్చయ్య పాల్గొని అధికారులతోను, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అవసరమో వివరించారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోను, గ్రామంలోను జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ముందుగా గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో బస చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివరామిరెడ్డి, ఎంపీటీసీ అంజిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలబడాలి

పెదకూరపాడు: మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్‌షరీఫ్ అన్నారు. మండలంలోని లగడపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించి డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్ర, కోటేశ్వరరావు, సర్పంచ్ వి.నాగేశ్వరరావు, నాని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

బెల్లంకొండ: పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు, అవినీతి రహిత పాలన సాగించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావాలని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యాక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయాన్ని సందర్శించి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ గాదెమిల్లు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు అహ్మద్ పాషా, గ్రామ సర్పంచ్‌లు దారం రమణారెడ్డి, తురకా శ్రీను, భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, సాయిరెడ్డి, వైస్ సర్పంచ్ మారం ప్రసాదరెడ్డి, రాము, చిట్టిబాబు, రామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీను వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పరిపాలన



ఇనిమెట్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి

రాజుపాలెం: గత టీడీపీ ప్రభుత్వానికి ఇప్పుడు వైఎస్సార్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు తేడా తెలుసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూర్తి మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెట్లలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి పథకాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును మాజీ ఎమ్మెల్యే , స్థానిక నాయకులతో కలసి ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ గ్రామంలో సంక్షేమం, అభివృద్ధికి జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.35కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరలా సీఎం జగన్‌కు, మంత్రి రాంబాబుకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ రాజేశ్వరిచంద్రమౌళి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సునీతశ్రీనివాసరెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగాల సీతయ్య, వైస్ ఎంపీపీ ఎస్‌కే మాబూ సుభాని, మాజీ సర్పంచ్ మౌలాలీ, వైస్ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల ఆనందం కోసం జగనే రావాలి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి



11వ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న డాక్టర్ గీతాహాసంతి

సత్తెనపల్లి: పేదల కళ్లల్లో ఆనందం చూడాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ రావాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి అన్నారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని 19,20 వార్డులకు సంబంధించి 11వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాలకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. మళ్లీ జగనన్న సీఎం కాక పోతే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడుతుందన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్చుత శివప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగన్ రావాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, 19వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు, 20వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మౌలాలిలు మాట్లాడారు. ముందుగా 11వ సచివాలయం పరిధిలో రూ.25,70,47,347 జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వార్డులో బస చేసేందుకు ఉపక్రమించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ రమేష్, జేసీఎస్ ఇన్‌చార్జ్ స్వాతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులున్నారు.

ఓటరుగా నమోదు కండి

- మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి
- ఎస్‌బీజీ డిగ్రీ కళాశాలలో ఓటర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన
- సత్తెనపల్లిలో యువతకు అవగాహన ర్యాలీ



సత్తెనపల్లి: అర్హత ఉన్న యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌బీజీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు రిజిస్ట్రేషన్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమానికి పట్టణంలో ప్రచారం కల్పించడంతో పాటు ఓటర్ నమోదుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో 2024 జనవరి 1 నాటికి ఓటు హక్కు లేని యువత లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎస్.సురేష్ మాట్లాడుతూ యువత నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ మిగలకుండా ఓటర్లుగా నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. డిసెంబర్ 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దరఖాస్తులపై అవగాహన కల్పించారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1950కు డయల్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీజీ ప్రిన్సిపల్ డీ.మాధవి, బీఎల్వోలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు
- 'ఆడుదాం ఆంధ్ర' విజయవంతానికి క్రీడాకారులతో సమావేశం, ర్యాలీ



ఆడుదాం ఆంధ్ర ర్యాలీలో చల్లంచర్ల, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, కమిషనర్ షమ్మి, పీడీ రియాజ్

సత్తెనపల్లి: విద్యతో పాటు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, క్రీడాకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పేరుతో 15 ఏళ్ల పైబడిన యువతీయువకులకు ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తారన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్రాలో భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో ఎంతోమంది ఉత్తమ క్రీడాకారులు తయారవుతారన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటిలో సర్వే చేసి క్రీడాకారులను, ప్రేక్షకుల పేర్లను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ఈ నెల 27న ప్రారంభమైందని డిసెంబర్ 13 వరకు చేసుకోవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, సుగాలీ కాలనీ జెడ్పీ హైస్కూల్ పీడీ షేక్ ఎండీ రియాజ్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, క్రీడాకారులు, తదితరులున్నారు.

ఓటే వజ్రాయుధం

పెదకూరపాడు: ఓటే వజ్రాయుధమని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ నోడల్ అధికారి, పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ అన్నారు. పెదకూరపాడులో కాకతీయ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు నమోదు అధికారి నాగజ్యోతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జియావుర్ హుక్, విద్యార్థులు, తదతరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

నకరికల్లు: చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసి నగదు రికవరీ చేసినట్లు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ బుధవారం తెలిపారు. మండలంలోని దేచవరం గ్రామంలో సెప్టెంబర్ 6వ తేదీన మణికంఠ పెస్టిసైడ్స్‌లో చోరీకి పాల్పడి రూ.1.50 లక్షల నగదు అపహరించారని అన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించామన్నారు. దొండేటి వెంకటేశ్వరరెడ్డి, మున్నంగి కిశోర్‌రెడ్డి, ఇర్లా దుర్గాప్రసాద్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1.20 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు. కేసును ఛేదించడంలో సహకరించిన ఏఎస్‌ఐ వి.కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు పొందాలి


- డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు
- క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



పాలిటెక్నిక్ విద్యార్థులతో ఓటు హక్కు అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్

క్రోసూరు: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ తప్పనిసరిగా ఓటుహక్కు పొందాలని డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు ద్వారానే మంచిపాలకులను ఎన్నుకోవాలన్నారు. భావి పౌరుల చేతుల్లో దేశం ముందుకు సాగుతుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో బీఎల్వోలుంటారని, వారిని కలుసుకుని తగిన సూచనలు తీసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక దీపోత్సవం



విశేష అలంకరణలో భక్తాంజనేయస్వామి

సత్తెనపల్లి: కార్తీక మాసం పురస్కరించుకొని పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో గల భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం, స్వామి వారికి విశేషాలంకరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రుల య్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కాంతులీనుతున్న కార్తీక దీపోత్సవం

15వ రోజుకు చేరిన పెన్షనర్ల ధర్నా

సత్తెనపల్లి: పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో లీజుకు తీసుకున్న గదులను ఖాళీ చేయాలని కోరుతూ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా బుధవారం 15వ రోజుకు చేరింది. లీజు గడువు పూర్తయినప్పటికీ జవ్వాజి సాంబశివరావు గదులు ఖాళీ చేయకుండా ఇబ్బందులు పెట్టడం సరైనది కాదన్నారు. పెన్షనర్స్ నల్లరిబ్బన్‌లు ధరించి గదుల ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి జక్కుల లక్ష్మీనారాయణ, అసోసియేషన్ నాయకులు ఉన్నారు.